సాక్షి
మంచిర్యాల
శుక్రవారం । 17 । ఫిబ్రవరి । 2023



క్రీడల్లో నైపుణ్యం సాధించాలి

క్రీడాకారులు క్రీడల్లో నైపుణ్యం సాధించాలని ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. గురువారం శ్రీరాంపూర్ మైదానంలో జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభించారు. 10లో▸



పుష్కరఘాట్ ఏర్పాట్ల పరిశీలన

మంచిర్యాలటౌన్: మంచిర్యాల గోదావరి నది వద్ద భక్తుల పుణ్య స్నానాలకు అవసరమైన ఏర్పాట్లను ఎమ్మెల్యే ఎన్.దివాకర్‌రావు పరిశీలించారు. మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, కమిషనర్ రాజు పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
35.0 /17.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఉత్తరం దిశగా గాలులు వీస్తాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

‘తీరం వెంట నిరంతర నిఘా’



పడవలో ప్రయాణిస్తున్న డీసీపీ సుధీర్

వేమనపల్లి: మహారాష్ట్ర–తెలంగాణ సరిహద్దు ప్రాణహిత తీరం వెంట నిరంతరం నిఘా ఏర్పాటు చేయాలని మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ సూచించారు. గురువారం ఆయన జైపూర్ ఏసీపీ నరేందర్‌తో కలిసి మండలాన్ని ఆనుకొని ఉన్న కళ్లంపల్లి, వేమనపల్లి పుష్కరఘాట్ ఫెర్రి పాయింట్‌ను సందర్శించారు. పడవలో అవతలి వైపు ఉన్న మహారాష్ట్ర తీరం వైపు వెళ్లి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. అనంతరం నిరుపేదలకు బియ్యం, దుప్పట్లు, యువతకు ఆట సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నరేందర్, రూరల్ సీఐ విద్యాసాగర్, నీల్వాయి, కోటపల్లి ఎస్సైలు నరేష్, వెంకట్ పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం

కోటపల్లి: ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే పోలీసుల లక్ష్యమని డీసీపీ సుధీర్ రాంనాథ్ అన్నారు. కోటపల్లి పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల ఫైళ్లు, రికార్డులు పరిశీలించారు. నేరాల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కార్పొరేటుకు దీటుగా గ్రంథాలయాల అభివృద్ధి



మాట్లాడుతున్న సంస్థ చైర్మన్ ప్రవీణ్

మంచిర్యాలఅర్బన్: గ్రంథాలయాలను కార్పొరేట్ సంస్థలకు దీటుగా ఆధునిక హంగులతో తీర్చిదిద్దుతామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 2023–24 బడ్జెట్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షల అభ్యర్థులకు ఆన్ డిమాండ్ పుస్తకాలను అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. వేమనపల్లిలో గ్రంథాలయం నిర్మిస్తామని తెలిపారు. బెల్లంపల్లి శాఖ గ్రంథాలయంలో ఆర్వో ప్లాంటుకు రూ.5లక్షలు, జిల్లాలోని శాఖ గ్రంథాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు, నూతన భవనాలకు రూ.45లక్షలతో ఆమోదం తెలిపారు. నూతనంగా జిల్లాకు వచ్చిన డీపీవో ఫణిందర్‌రావును సన్మానించారు. సమావేశంలో డీఈవో ఎస్.వెంకటేశ్వర్లు, డీపీఆర్వో సంపత్‌కుమార్, వయోజన విద్యాశాఖాధికారి పురుషోత్తంనాయక్, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కేవీ మున్వేశరావు పాల్గొన్నారు.

‘హామీలు విస్మరించిన ఎమ్మెల్యే’



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో విస్మరించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి విమర్శించారు. గురువారం ప్రజాగోస–బీజేపీ భరోసా పాదయాత్ర పట్టణంలోని భగవంతంవాడ, చున్నంబట్టి, తిలక్‌నగర్, రాజీవ్‌నగర్, గాంధీనగర్‌లో నిర్వహించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో ప్రజలకు కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, నాయకులు రజినిష్ జైన్, పెద్దపల్లి పురుషోత్తం, అరుమల్ల పోషం, రవీందర్‌రావు, పానుగంటి మధు, ముదాం మల్లేష్, పట్టి వెంకటకృష్ణ, పూదరి రమేష్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై వినతి



వినతిపత్రం ఇస్తున్న పవర్‌ప్లాంట్ కార్మికులు

పాతమంచిర్యాల: జిల్లాలో మూతపడిన శాలివాహన గ్రీన్‌ఎనర్జి పవర్‌ప్లాంటు కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని, ప్లాంటులో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాలని వరంగల్‌లోని జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్(జేసీఎల్) సునీతకు వినతిపత్రం అందజేశారు. కార్మికులకు 2022 సెప్టెంబర్ నుంచి వేతనాలు ఇవ్వలేదని, మూడేళ్ల బోనస్‌పై యాజమాన్యం స్పందించడం లేదని పేర్కొన్నారు. ఈ నెల 23న యాజమాన్యం, కార్మిక సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి వేతనాలు, బోనస్ బకాయిలు ఇప్పించే విధంగా చర్యలు తీసుకుంటామని జేసీఎల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కుంటాల శంకర్, సీఐటీయూ కార్మిక సంఘం అధ్యక్షుడు ప్రకాష్, ఉపాధ్యక్షుడు ఆనందరావు, అనుమాల శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.

దొంగ దొరకలే..!

రెండేళ్ల క్రితం మందమర్రి పట్టణం విద్యానగర్‌లో విశ్రాంత గని కార్మికుడి ఇంట్లో 11తులాలకు పైగా బంగారం చోరీకి గురైంది. పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే రెండు నెలలకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆరు నెలల్లో తిరిగి ఆ కేసు మూసేశారు. కేసుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు దొరకడం లేదని చేతులు దులిపేసుకున్నారు. గత కొంతకాలంగా జిల్లాలో దొంగలు బెంబేలెత్తిస్తున్నారు. ముఖ్యంగా సింగరేణి కార్మిక వాడల్లో పట్టపగలే చోరీలు జరుగుతున్నాయి. తాళాలు పగులగొట్టి ఇంట్లోని సొత్తును ఎత్తుకెళ్తున్నారు. బాధితులు కష్టపడి కూడబెట్టుకున్న సొమ్ము దుండగుల పాలవుతోంది. జిల్లాలో ఏటా రూ.కోట్లలో సొమ్ము దొంగలపాలవుతోంది. దీంతో అనేక మధ్య తరగతి కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి.





గత డిసెంబర్ 16న నిరంతరం సెక్యూరిటీ ఉండే సీసీసీ ఆఫీసర్స్ బంగ్లా ఏరియాలో ఓ అధికారి ఇంట్లో చోరీ

- ఏటా రూ.కోట్ల సొమ్ము చోరుల పాలు
- ఆధునిక వ్యవస్థ ఉన్నా ఆగని చోరీలు
- జిల్లాలో పట్టపగలే దొంగతనాలు నమోదు
- అప్రమత్తత, నియంత్రణ లేకుంటే మరింత నష్టం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: దొంగలు దొంగలు ఊళ్లు పంచుకుంటారనేది పాతమాట. ఇప్పుడు ఇళ్లకు ఇళ్లు పంచుకుంటున్నారు. ఎక్కడి నుంచి వస్తున్నారో తెలియదు గానీ ఒక్కో చోట ఒక్కో తీరుగా చోరీలు చేస్తున్నారు. జిల్లాలో ఏ రోజు ఎక్కడ దొంగతనం వెలుగులోకి వస్తుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఇంటికి తాళం వేసి వెళ్లాలంటే భయం కలుగుతోంది. ఒకే రోజు రెండు మూడు ఇళ్లలో దొంగతనాలు జరిగిన ఘటనలు ఉన్నాయి. గత కొద్ది రోజులుగా వరుసగా దొంగతనాలు జరుగుతున్నాయి. కోల్‌బెల్ట్ ఏరియాల్లో కార్మికులు మరింత ఆందోళన చెందుతున్నారు. తమ చుట్టుపక్కల వారి ఇళ్లలో సొమ్ము కోల్పోతుంటే ఆవేదన చెందుతున్నారు. దుకాణాలు, వ్యాపార కేంద్రాలు, సింగరేణి సామగ్రి, ప్రభుత్వ ఆస్తులు తదితర చోట్ల సీసీ కెమెరాలు, నిత్యం నిఘా ఉన్న చోట్ల కూడా ఈ ఘటనలు జరుగుతున్నాయి.

నిరంతర గస్తీ ఉన్నా..

జిల్లాలో నిరంతరం పోలీసు గస్తీ, 24గంటలు పని చేస్తున్న ఆధునిక పోలీసు వ్యవస్థ అందుబాటులో ఉన్నా ఇవేవీ చోరీలను ఆపలేకపోతున్నాయి. నేరస్తులను పట్టుకోవడానికి సీసీ కెమెరాలు, పాత నేరస్తులు, ముఠాలు, గ్యాంగ్‌లు, తరచూ చేసే వారిపైనా నిఘాపెట్టినా చోరీలు ఆగడం లేదు. పాత నేరస్తులు పట్టుబడితే గత ట్రాక్ రికార్డు ప్రకారం వేలిముద్రలు, ముఖాల గుర్తింపులతో ఎక్కడ దొంగతనాలు జరిగినా ఇట్టే దొరికిపోయేవి. దొంగ సొమ్మును ఎక్కడ అమ్మారు? అనే వివరాలు సేకరించే వారు. పాతవారి కంటే కొత్త వాళ్లే ఈ నేరాలు పాల్పడుతుండడంతో వారి గత చరిత్ర లేక పాత వేలిముద్రల డేటాలతో లాభం లేకుండా పోతోంది. చాలా కేసుల్లో కేసు చేధన కోసం ముఖ్య ఆధారాలు లేకపోవడం, అనుమానిత వ్యక్తుల నుంచి సరైన సమాచారం లేకపోవడంతోనూ సొమ్మంతా దొంగలపాలవుతోంది. ఇక కొందరు పోలీసు అధికారులు సైతం విచారణలో నిర్లక్ష్యంతోనూ ఏళ్లుగా అనేక కేసుల్లోనూ ఎటువంటి పురోగతి లేక బాధితులకు ఊరట దక్కడం లేదు.

జిల్లాలో దొంగతనాలు

సంవత్సరం	నమోదైన కేసులు	చేధించినవి	చోరీ సొమ్ము	రికవరి	రికవరీ శాతం
2022	325	133	రూ.2.39కోట్లు	రూ.1.06కోట్లు	45
2023	37	13	రూ.2.07కోట్లు	రూ.2.49లక్షలు	9 (జనవరి వరకు)



అవగాహన కొరవడి..

జిల్లాలో చాలా చోట్ల మధ్యతరగతి ఇళ్లు, కాలనీల్లో ఇంకా సీసీ కెమెరాలు లేవు. ఎవరైనా ఇంటికి తాళం వేసి వెళ్లాల్సి వస్తే, విలువైన వస్తువుల పట్ల జాగ్రత్తలు, పోలీసులకు సమాచారం ఇవ్వడం పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. కాలనీల్లో కొత్తవారి పట్ల అప్రమత్తత లేక సమస్యలు వస్తున్నాయి. జిల్లా పరిధిలో దొంగతనాలు చేసి, రైల్వే మార్గం గుండా నేరస్తులు రాష్ట్రాలు దాటేస్తున్నారు. రెండు గంటల్లోనే పొరుగు రాష్ట్రాలకు వెళ్లిపోయే వీలుంది. చోరీలు జరుగుతున్న ఇళ్లలో తెలిసినా, బంధువులే కొందరు నేరాలకు పాల్పడి, చిక్కకుండా తప్పించుకుంటున్నారు. ఇక పట్టణాల్లో కాలనీలు, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు దొంగతనాలపై ప్రత్యేక అవగాహన, జాగ్రత్తలపై విస్తృత ప్రచారం చేయాల్సి ఉంది. ఇటీవల ఆయా స్టేషన్ పరిధిలో పట్టణాల్లో కొత్తగా ఇళ్లలో అద్దెకు ఉండేవారి వివరాలు సేకరణ చేపట్టారు.

ముందస్తు చర్యలు తీసుకుంటాం



సాధారణంగా వేసవిలో దొంగతనాలు అధికంగా ఉంటాయి. వీటిపై ప్రజల్లో మరింత అవగాహన రావాలి. ముందు జాగ్రత్తలతో చాలా నేరాలు తగ్గించవచ్చు. ప్రజల్లో ప్రసార మాధ్యమాలతో అప్రమత్తం చేయిస్తాం. నమోదైన కేసుల్లోనూ నేరస్తులను పట్టుకుంటాం. క్లోజ్ చేసిన చోరీల కేసులపై స్టేషన్ల వారీగా డేటా తీసుకుని పరిశీలిస్తాం.

– రెమా రాజేశ్వరి, సీపీ, రామగుండం కమిషనరేట్

గోదావరినదిలో తగ్గిన నీటిమట్టం

- మహా శివరాత్రి పుణ్య స్నానాలకు భక్తుల తిప్పలు
- కాళేశ్వరం ప్రాజెక్ట్ నీటి విడుదలకు వేడుకోలు



నీటిమట్టం తగ్గిన చెన్నూర్ గోదావరినది

చెన్నూర్: చెన్నూర్ గోదావరి నదిలో నీటి మట్టం తగ్గింది. ఫిబ్రవరిలోనే నీరు తగ్గడంతో మహా శివరాత్రి పుణ్యస్నానాలకు వచ్చే భక్తులు ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడింది. చెన్నూర్ గోదావరి నది ఉత్తర దిశగా ఆరు మైళ్లు ప్రవహించడంతో ఈ నదికి పంచకోశ ఉత్తర వాహినిగా పేరుంది. ఇక్కడి నదిలో స్నానం ఆచరిస్తే కాశీ నదిలో ఆచరించినంత పుణ్యఫలం దక్కుతుందని భక్తుల నమ్మకం. శనివారం మహా శివరాత్రి సందర్భంగా పుణ్యస్నానాలకు చెన్నూర్ మండలంతోపాటు కోటపల్లి, వేమనపల్లి, జైపూర్, మంచిర్యాల మండలాల నుంచి సుమారు 50వేల మంది తరలివచ్చే అవకాశం ఉంది. నదిలో నీటి ప్రవాహం తగ్గడంతోపాటు అవతలి ఒడ్డుకు చేరడంతో పూర్తిగా తగ్గింది. స్నానాలు ఆచరించే భక్తులు నదిలో కిలోమీటరుకు పైగా నడవాల్సి వస్తుంది. మహా శివరాత్రిని పురస్కరించుకుని అధికారులు కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని విడుదల చేయాలని భక్తులు కోరుతున్నారు.

పకడ్బందీగా ప్రీఫైనల్ పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి విద్యార్థులకు ఈ నెల 23నుంచి 27 వరకు ప్రీఫైనల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో వెంకటేశ్వర్లు ఆదేశించారు. ఈ నెల 20నుంచి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రశ్నపత్రాలు(సీల్డ్‌కవర్) అందజేస్తామని పేర్కొన్నారు. 22న ఫస్ట్ లాంగ్వేజ్, 23న సెకండ్ లాంగ్వేజ్, 24న థర్డ్ లాంగ్వేజ్, 25న గణితం, 27న జనరల్ సైన్స్, 28న సోషల్ స్టడీస్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

ఊరికో ‘సంఘం’..!

- ఏర్పాటు యోచనలో కేంద్ర ప్రభుత్వం
- సహకారోద్యమాన్ని బలోపేతం దిశగా గ్రామానికో పీఏసీఎస్ ఏర్పాటుకు నిర్ణయం
- వచ్చే ఐదేళ్ల కాలంలో ప్రక్రియ పూర్తి!
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 77 సంఘాలు
- హర్షం వ్యక్తంజేస్తున్న సంఘాల సభ్యులు



తలమడుగు పీఏసీఎస్ కార్యాలయం

సాక్షి, ఆదిలాబాద్: గ్రామానికో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. సహకారోద్యమాన్ని బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో మండలానికి ఒకటి లేదా రెండు సంఘాలే ఉండగా వీటి సేవలను విస్తరించాలని భావిస్తోంది. ఢిల్లీలో బుధవారం కేంద్ర కేబినెట్ ఇందుకు సంబంధించి నిర్ణయం తీసుకుంది. రాబోయే ఐదేళ్లలో దేశంలో రెండు లక్షల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని తీర్మానించింది.

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం ఇలా..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రస్తుతం 77 పీఏసీఎస్‌లున్నాయి. వీటిలో లక్షకు పైగా సభ్యులున్నారు. 50వేలకు పైగా రుణాలు పొందే రైతులున్నారు. సహకార బ్యాంక్‌లు పీఏసీఎస్‌లకు ఫైనాన్స్ చేస్తున్నాయి. ఈ పీఏసీఎస్‌లు దాని నుంచి రైతులకు మార్జిన్‌పై రుణాలు అందిస్తున్నాయి. అంతేకాకుండా సంఘాల ద్వారా ఎరువులు సరఫరా చేస్తున్నాయి. నాఫెడ్, మార్క్‌ఫెడ్‌లకు అనుబంధంగా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. రైతులకు అవసరమయ్యే రీతిలో పీఏసీఎస్‌ల ద్వారా ఏదైనా పనిచేసుకునేందుకు ఆస్కారం ఉంటుంది. ఉదాహరణకు.. రైతుకు వ్యవసాయ పనుల్లో అవసరమయ్యే పనిముట్లను కూడా విక్రయించేందుకు అవకాశం ఉంది. మన దగ్గర మాత్రం ప్రధానంగా రుణాలు, ఎరువుల పంపిణీ, పంటల కొనుగోళ్లు మాత్రమే జరుగుతున్నాయి.

అన్నదాతల్లో హర్షాతిరేకాలు

2005లో వైద్యనాథ్ కమిటీ ఈ సహకార సంఘాల విషయంలో కొన్ని సూచనలు జారీ చేయగా అప్పట్లో నష్టాల్లో ఉన్న వీటిని పక్కనున్న ఇతర సంఘాల్లో కలిపారు. తద్వారా పీఏసీఎస్‌ల సంఖ్య తగ్గింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం మాత్రం మళ్లీ వీటి సంఖ్య పెంచాలనుకోవడం, గ్రామానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ముందుకు కదలడంపై రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

విధివిధానాలు ఖరారు కాలేదు



కొత్త పీఏసీఎస్‌లను ఏర్పాటు చేయాలని కేంద్రం ఉద్దేశంలో ఉంది. ఐదారు నెలల కిందటే ఈ ప్రక్రియ మొదలైంది. అయితే ఇప్పటికీ విధివిధానాలు ఖరారు కాలేదు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రూ.3 కోట్ల నుంచి రూ.39 కోట్ల వరకు ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్న సొసైటీలున్నాయి.

– శ్రీధర్‌రెడ్డి, సీఈవో, డీసీసీ బ్యాంక్, ఆదిలాబాద్

సంఘాల ఆర్థిక స్థితి ఇలా..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సహకార సంఘాల పరిస్థితిని పరిశీలిస్తే.. ఎక్కువ సంఘాలు రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్ల ఆర్థిక లావాదేవీల్లో ఉన్నాయి. ఓ ఐదు మాత్రం రూ.5కోట్ల లోపు ఉన్నాయి. తాంసూర్ సొసైటీ రూ.39 కోట్ల లావాదేవీలతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అగ్రగామిగా ఉంది. నిర్మల్ రూ.29 కోట్లు, నేరడిగొండ, బోథ్ రూ.20 కోట్ల నుంచి రూ.25 కోట్ల మధ్య ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు సొసైటీ సూపర్‌బజార్‌ను నిర్వహిస్తోంది. ఇలా వివిధ కార్యకలాపాల నిర్వహణ ద్వారా సంఘాలు ఆర్థికంగా పరిపుష్టి సాధిస్తున్నాయి. రానున్న రోజుల్లో గ్రామానికో సొసైటీ ఏర్పాటుతో తమకు మేలు జరుగుతుందన్న అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల కేంద్ర సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసింది. ఆ తర్వాత దేశంలో సహకార సంఘాలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ముందుకు కదులుతోంది. అందులో భాగంగానే ఈ మార్పులకు సిద్ధమవుతోంది.

‘బండి సంజయ్.. భాష మార్చుకో’



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

వేమనపల్లి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి మాట్లాడే భాష మార్చుకోవాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మండిపడ్డారు. వేమనపల్లి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొండగట్టు దేవస్థానం పర్యటనకు సీఎం కేసీఆర్ వెళ్తే అవాకులు, చవాకులు మాట్లాడడం సరికాదన్నారు. ఏళ్ల తరబడి కాంగ్రెస్ పార్టీలో పని చేసిన గడ్డం సోదరులకు రాజకీయంగా నిలకడ లేదని విమర్శించారు. తనపై భూకబ్జాలు, అవినీతి, ఆరోపణలు చేయడం తగదని, ఎక్కడైనా అవినీతి, సెంటు భూమి భూ కబ్జా చేసినట్లు నిరూపించిన రాజకీయానికి దూరంగా ఉంటానని అన్నారు. ప్రజల కష్టాలు తెలియని గడ్డం సోదరులు వేరే రాష్ట్రాలు, దేశాల్లో పరిశ్రమలు వ్యాపారులు చూసుకోవాలని అన్నారు. తాను ప్రజల్లోనే ఉంటానని, ప్రజల సేవలోనే ప్రాణాలు అర్పిస్తానని ఉద్వేగంగా మాట్లాడారు.

క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయం



జూనియర్స్ విజేత ఎస్ఆర్ఆర్ కళాశాల జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న కలెక్టర్



సీనియర్స్ విజేత వాగ్దేవి డిగ్రీ కళాశాల జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న ఏసీపీ

- నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- ఎస్‌పీఎల్ సీనియర్స్ విజేత మంచిర్యాల వాగ్దేవి డిగ్రీ కళాశాల జట్టు
- జూనియర్స్ విజేత మంచిర్యాల ఎస్ఆర్ఆర్

SAKSHI DIGITAL MEDIA GROUP

SPL SAKSHI PREMIER LEAGUE

నిజామాబాద్‌నాగారం: లక్ష్యాలను ఏర్పర్చుకుని క్రీడల్లో కఠోరంగా సాధన చేస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి ‘సాక్షి’ మీడియా క్రికెట్ టోర్నమెంటు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. గురువారం నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ‘సాక్షి’ ప్రీమియర్ లీగ్ రీజినల్ క్రికెట్ టోర్నమెంటు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడలతోపాటు చదువును నిర్లక్ష్యం చేయొద్దని అన్నారు. నగర ఏసీపీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో క్రీడలు చాలా అవసరమని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తమవంతు బాధ్యతగా ఆడాలని అన్నారు. అనంతరం విజేతలకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఏసీపీ కిరణ్‌కుమార్ ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో సుధాకర్ పైప్స్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ రాజేశ్, సురేశ్, ‘సాక్షి’ బ్రాంచ్ మేనేజర్ పల్లే మహేశ్, బ్యూరో ఇన్‌చార్జి తమ్మాటి భద్రారెడ్డి, సాక్షి ఈవెంట్స్ మేనేజర్ సుమన్, క్రికెట్ కోచ్ ఫారస్, గ్రౌండ్‌మన్ నారాయణ పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్ విజేతలు రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొంటారు.

విజేతలు..

సీనియర్స్ విభాగంలో మంచిర్యాల వాగ్దేవి డిగ్రీ కళాశాల, నిజామాబాద్ నిశిత డిగ్రీ కళాశాల జట్లు పోటీ పడ్డాయి. వాగ్దేవి డిగ్రీ కళాశాల జట్టు 12ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 99 పరుగులు చేసింది. అనంతరం నిశిత డిగ్రీ కళాశాల జట్టు ఏడు వికెట్ల నష్టానికి 93 పరుగులు చేసింది. ఆరు పరుగుల తేడాతో వాగ్దేవి డిగ్రీ కళాశాల విజేతగా నిలువగా, నిజామాబాద్ నిశిత డిగ్రీ కళాశాల రన్నరప్‌గా నిలిచింది.

జూనియర్స్‌లో..

జూనియర్స్ విభాగంలో ఎస్ఆర్ఆర్ మంచిర్యాల కళాశాల, నిజామాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్లు తలపడ్డాయి. ఎస్ఆర్ఆర్ కళాశాల జట్టు 12 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 104 పరుగులు చేసింది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్టు 12 ఓవర్లలో 65 పరుగులు చేసి ఆల్అవుట్ అయ్యింది. ఎస్ఆర్ఆర్ మంచిర్యాల కళాశాల జట్టులో సంతోష్ హ్యాట్రిక్‌తోపాటు మొత్తం 4 వికెట్లు తీసుకుని మ్యాచ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. అద్భుతమైన ఇన్నింగ్స్‌తో విన్నర్‌గా నిలిచింది.

క్లుప్తంగా

గిరిజన మత్స్యకారులకు నైపుణ్య శిక్షణ


శిక్షణ పొందిన సభ్యులతో అధికారులు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని నర్సాపూర్ పంచాయతీ పరిధి గొట్టి చెరువులో గిరిజన మత్స్య సహకార సంఘాల సభ్యులకు గురువారం నైపుణ్య శిక్షణ ఇచ్చారు. కుమురంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల మత్స్యశాఖ అధికారులు విజయ్‌కుమార్, సాంబశివరావు పరిశీలకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాజెక్ట్ అధికారి ఆదేశాల మేరకు ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన మత్స్య సహకార సంఘాల సభ్యులకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. నర్సాపూర్, గొట్టి, సాకెర, కేస్లాపూర్, సాలేగూడ, బలాన్‌పూర్, గుండాల, బాబేఝురి గ్రామాల నుంచి 190 మంది గిరిజన ఔత్సాహిక సభ్యులు నైపుణ్య పరీక్షకు హాజరైనట్లు పేర్కొన్నారు. కోఆపరేటివ్ అధికారులు బాషా, పెసా కోఆర్డినేటర్ వసంత్‌రావు, స్థానిక సర్పంచ్ పెందూర్ కళావతి, మత్స్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ముల్కల్ల పుష్కరఘాట్ మూసివేత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు పుణ్యస్నానాలకు ముల్కల్ల పుష్కరఘాట్‌కు రాకుండా ప్రత్యామ్నాయం చూసుకోవాలని మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి సూచించారు. గురువారం సర్పంచ్ మంచాల శ్రీనివాస్, శిక్షణ కలెక్టర్ గౌతమి, తహసీల్దార్ రాజలింగు, ఎంపీడీఓ అబ్దుల్‌హై, రూరల్ సీఐ సంజీవ్, ఎస్సై ఉదయ్‌కిరణ్‌లతో కలిసి ఏర్పాట్లు సమీక్షించారు. ముల్కల్ల పుష్కరఘాట్ గోదావరి పరీవాహక ప్రాంతం లోతుగా, బురదమయంగా ఉండడంతో భక్తులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. దీంతో పుష్కర ఘాట్‌కు వచ్చే దారిని మూసివేస్తున్నట్లు తెలిపారు.

పశువులను తరలిస్తున్న ఇద్దరి అరెస్టు


పశువులను దించుతున్న స్థానికులు

దండేపల్లి(మంచిర్యాల): మండలంలోని గూడెం అటవీ చెక్‌పోస్ట్ వద్ద అక్రమంగా తరలిస్తున్న పశువులను స్థానికులు పట్టుకున్నట్లు ఎస్సై సాంబమూర్తి తెలిపారు. గురువారం కొటాల నుంచి నిజామాబాద్ వైపు లారీలో తరలిస్తుండగా గమనించిన స్థానికులు లారీని అడ్డుకుని ఎస్సై సాంబమూర్తికి సమాచారం అందించారు. సిబ్బందితో అక్కడకు వెళ్లి లారీలో ఉన్న 48 పశువులను కిందకు దించారు. అందులో కొన్నింటికి గాయాలు కావడంతో పశువైద్యసిబ్బందిని పిలిపించి చికిత్స అందించారు. అనంతరం స్థానిక షిర్డీ సాయి బాబా ఆలయంలోని గోశాలకు తరలించారు. కాగజ్‌నగర్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు వీటిని తరలిస్తున్నట్లుగా ఎస్సై తెలిపారు. అందులో ఇద్దరి అదుపులోకి తీసుకున్నామని, ఒకరు పరారీలో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురిపై కేసు

దండేపల్లి(మంచిర్యాల): మామిడిపల్లి పంచాయతీ పరిధిలోని దొరగారిపల్లె ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలి విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాంబమూర్తి తెలిపారు. గ్రామానికి చెందిన అనిల్, దైసాబ్, మహేందర్, బుధవారం మధ్యాహ్న భోజన సమయంలో మద్యం సేవించి పాఠశాలకు వెళ్లి ప్రధానోపాధ్యాయురాలితో అమర్యాదగా ప్రవర్తిస్తూ విధులకు ఆటంకం కలిగించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

టీచర్ కొట్టిందని ఫిర్యాదు..

దొరగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న బానుశ్రీని పాఠశాల హెచ్‌ఎం కొట్టిందని విద్యార్థిని తల్లిదండ్రులు సాయి, స్వాతి, గురువారం దండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై హెచ్‌ఎం మంజులను వివరణ కోరగా బుధవారం పాఠశాలకు ముగ్గురు వ్యక్తులు వచ్చి తన పట్ల అమర్యాదగా ప్రవర్తించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. దీనిని మనసులో ఉంచుకుని తనపై ఆరోపణలు చేస్తున్నారన్నారు.

ప్లాస్టిక్ పైపులు దగ్ధం

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి ఏరియాలోని స్టోర్స్, కేకే–1 గని వెనుక అటవీప్రాంతంలో వాటర్ సప్లై చేసే సుమారు ముప్పై ప్లాస్టిక్ పైపులు గురువారం దగ్ధమయ్యాయి.అటవీ ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున మంటలు రావడంతో గమనించిన కొందరు 100కు సమాచారం అందించారు. ఫైరింజన్ వచ్చి మంటలు ఆర్పివేసింది. విషయం తెలుసుకున్న సింగరేణి అధికారులు, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు.

ప్రభావిత గ్రామాలను అభివృద్ధి చేయాలి

- భూగర్భ జలాలను సంరక్షించాలి
- పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో పలువురి డిమాండ్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్


హాజరైన సింగరేణి ప్రాంత నేతలు, ప్రజలు

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి ప్రభావిత గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఆర్కే 5, ఆర్కే 6 గనులు వార్షిక సంవత్సరంలో పరిమితికి మించి ఉత్పత్తి తీసినందుకు గానూ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గురువారం కృష్ణాకాలనీలోని శాంతి మైదానంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కాలుష్య నియంత్రణ మండలి నిజామాబాద్ రీజియన్ ఇంజినీరు జీ.లక్ష్మణ్ ప్రసాద్ హాజరై అభిప్రాయాలు నమోదు చేసుకున్నారు. ఆర్కే 5 గని 2008 నుంచి 2014 వరకు అనుమతి ఉన్న ఉత్పత్తి లక్ష్యం కంటే 4.26 లక్షల టన్నులు, ఆర్కే 6 గని 2009–10లో 6 వేల టన్నులు అదనంగా ఉత్పత్తి తీశాయి. దీని ఉల్లంఘన కేటగిరీలో కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం దీనిపై తిరిగి పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. తాళ్లపల్లి, కాన్కూరు, రామారావుపేట, సింగపూర్ గ్రామాల కింద ఈ రెండు గనుల మైనింగ్ పనులు నడుస్తున్నాయి. దీంతో ఈ గ్రామాల ప్రజలతో పాటు శ్రీరాంపూర్ ప్రాంతంలోని పలువురు ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు, పర్యావరణ వేత్తలు హాజరై వారి అభిప్రాయాలు, అభ్యంతరాలను సభ దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఎన్విరాన్‌మెంట్ జీఎం జీవీఎల్ గణపతి, అడిషనల్ మేనేజర్ సీహెచ్ శ్రీనివాస్, శ్రీరాంపూర్ ఏరియా ఎస్‌ఓటూ జీఎం త్యాగరాజు, ఏజెంట్లు ఏవీ రెడ్డి, సత్యనారాయణ, ఏరియా ఎన్విరాన్‌మెంట్ అధికారి హన్మాన్‌గౌడ్, టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, కేంద్ర ఉపాధ్యక్షులు డీ అన్నయ్య, మంద మల్లారెడ్డి, ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు ఎస్కే బాజీసైదా, కే.వీరభద్రయ్య, కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్, బ్రాంచి ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, సీఐటీయూ అధ్యక్షుడు రాజారెడ్డి, ఐఎఫ్‌టీయూ నాయకుడు టీ శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు జే.శంకర్‌రావు పాల్గొన్నారు.

భూగర్భ జలాలు కాపాడాలి



సింగరేణి వల్లే మా గ్రామాలు అభివృద్ధి చెందాయి. దీని వల్ల వస్తున్న ఇబ్బందులను పరిష్కరించాల్సిన బాధ్యత కూడా సింగరేణిదే. భూగర్భ గనుల వల్ల మా గ్రామంలో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. వీటిని కాపాడేందుకు పలుచోట్ల చెక్ డ్యాంలు నిర్మించాలి. గ్రామంలో సీసీరోడ్లు, డ్రెయినేజీలు, వీధి లైట్లు ఏర్పాటు చేయాలి. సేంద్రియ సాగుపై రైతులకు శిక్షణ ఇవ్వాలి.

– కే.వెంకటేశ్వర్‌గౌడ్, సర్పంచ్, కాన్కూరు

ఆంక్షలు సరికాదు



బొగ్గు డిమాండ్‌కు తగ్గట్లుగా భూగర్భ గనుల్లో అధికంగా ఉత్పత్తి చేస్తే కేంద్రమే అభినందించి ఇన్సెంటివ్‌లు ఇవ్వాలి. కానీ అదనంగా బొగ్గు ఉత్పత్తి చేస్తే ఇలాంటి అనుమతులు తీసుకోవాలని ఆంక్షలు పెట్టం సరికాదు. కేంద్రం నిర్ణయం వెనక్కి తీసుకోవా లి. ఈ భూగర్భ గనుల వల్ల ఎలాంటి పర్యావరణ ఇబ్బందులు ఉండవు. నేను ఇప్పటికీ 2500 సభలకు హాజరయ్యా. కాలుష్య కారకాలైన ఫెర్టిలైజర్స్, వాహనాల వినియోగం, ఇంకా ఇతర పర్యావరణ ఇబ్బందులు కలిగించే వాటిపై కేంద్రం దృష్టి పెట్టాలి.

– సునందరెడ్డి, పర్యావరణ వేత్త

మౌలిక సదుపాయాలు కల్పించాలి



సింగరేణి ప్రభావిత గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఈ ప్రాంతంలో కంపెనీ శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలి. పబ్లిక్ పార్కులు పెట్టడానికి మున్సిపల్ నిధులు ఉన్నా స్థలం లేదు. సింగరేణి స్థలం ఇవ్వడానికి ముందుకు వస్తే ఇలాంటి అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయి. ఆర్కే 6 హట్స్ ఏరియాలకు ఓసీపీ వస్తుందనే అనుమానాలు ఉన్నాయి. దీన్ని నివృత్తి చేయాల్సిన బాధ్యత కంపెనీపై ఉంది.

– ఈసంపల్లి ప్రభాకర్, మున్సిపల్ చైర్మన్

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



భూగర్భ జలాలు కాపాడేందుకు చెక్ డ్యాంలు నిర్మిస్తాం. పలుచోట్లు వీధిలైట్లు ఏర్పాటు చేస్తాం. ప్రజాభిప్రాయసేకరణకు ఆర్కే 6 హట్స్ ఏరియాలో ఓసీపీ రావడానికి ఏమాత్రం సంబంధం లేదు. దీనిపై ఆందోళన వద్దు. పరిశుద్ధమైన తాగునీటిని అందించేందుకు రూ.9 కోట్లతో ర్యాపిడీ గ్రావిటీ ఫోర్స్ ఫిల్టర్ ట్యాంకులు ఏర్పాటు చేస్తున్నాం. రూ.5 కోట్లతో గోదావరి నుంచి కాలనీలకు ప్రత్యేక పైప్‌లైన్ వేస్తున్నాం. స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. అభ్యంతరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– బీ.సంజీవరెడ్డి, జీఎం, శ్రీరాంపూర్

17 నుంచి సింగరేణిలో నిరసనలు

శ్రీరాంపూర్(మంచిర్యాల): బొగ్గు గని కార్మికులకు 11వ వేజ్‌బోర్డులో పరిష్కారం కావాల్సిన అలవెన్సులు, ఇతర డిమాండ్లపై వెంటనే ఒప్పందం చేయాలని డిమాండ్ చేస్తూ బీఎంఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి సింగరేణి వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్ తెలిపారు. గురువారం నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అలవెన్సుల పెంపు, లీవులు, వీడీఏ పెంపు, ఇతర రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి డిమాండ్లపై కూడా ఒప్పందం కావాల్సి ఉందన్నారు. ఈ నెల 17, 18, 20 తేదీల్లో కంపెనీ వ్యాప్తంగా అన్ని గనులు, డిపార్టుమెంట్లపై నల్లబ్యాడ్జీలతో నిరసన, 21న జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు.సమావేశంలో బ్రాంచి ఉపాధ్యక్షుడు పీ.మోహన్‌రెడ్డి, కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి, నాయకులు జీ.ప్రభాకర్, పంచెర్పుల నరేశ్, రామకృష్ణ పాల్గొన్నారు.

నవోదయలో ప్రవేశానికి 5,920 దరఖాస్తులు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2023–24 విద్యా సంవత్సరానికి గానూ ఆరోతరగతిలో ప్రవేశానికి నిర్వహించనున్న పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 15తో ముగిసిందని పాఠశాల ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్ నుంచి 1,378, నిర్మల్ జిల్లా నుంచి 1,589, మంచిర్యాల జిల్లా నుంచి 1,526, కుమురం భీం ఆసిఫాబాద్ నుంచి 1,427 మంది మొత్తం 5,920 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రశాంతంగా దేహదారుఢ్య పరీక్షలు


అభ్యర్థుల ఎత్తు పరిశీలిస్తున్న ఎస్పీ


లాంగ్‌జంప్ చేస్తున్న అభ్యర్థి

- రెండో రోజు 626 మంది హాజరు
- తుది రాత పరీక్షకు 279 మంది అర్హత
- పర్యవేక్షించిన ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: రెండో విడత ఎస్సై, పోలీసు కానిస్టేబుల్ శారీరక దేహదారుఢ్య పరీక్షలు రెండో రోజు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళా అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించారు. మహిళా అభ్యర్థులు ఉదయం ఈవెంట్స్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు సర్టిఫికెట్లు పరిశీలించారు. బయోమెట్రిక్, రెస్ట్‌బ్యాండ్, ఆర్‌ఎఫ్‌ఐడీలను పూర్తి చేశారు. అనంతరం 800 మీటర్ల పరుగు పందెం నిర్వహించారు. ఇందులో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు 4 మీటర్ల షార్ట్‌పుట్, 2.5 మీటర్ల లాంగ్ జంప్ అంశాల్లో పరీక్షలు నిర్వహించారు. సీసీ టీవీ నిఘాలో ఈ పరీక్షలు జరిగాయి. 772 మంది హాజరుకావాల్సి ఉండగా 626 మంది హాజరయ్యారు. 46 మంది గైర్హాజరయ్యారు. 279 మంది అన్ని పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి రాత పరీక్షకు అర్హత సాధించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు శ్రీనివాస్‌రావు, రాములు నాయక్, సమయ్‌జాన్‌రావు, డీఎస్పీలు ఆర్.వెంకటేశ్వర్లు, ఉమేందర్, నాగేందర్, ఉమామహేశ్వర్‌రావు, పోతారం శ్రీనివాస్, ఏఓ యూసుఫ్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాన్వాయ్ అడ్డగింత


అడ్డుకున్న బీజేపీ నాయకులు

వేమనపల్లి(బెల్లంపల్లి): మండలంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం బీజేపీ నాయకులు ఎమ్మెల్యే చిన్నయ్య కాన్వాయ్‌ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు బైస మల్లేశ్ మాట్లాడుతూ మండల కేంద్రంలో జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలని, నాగారం, మంగెనపల్లి వరకు శాశ్వత రోడ్డు నిర్మాణం చేపట్టాలని, వేమనపల్లిలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని డి మాండ్ చేశారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గణ పురం సంతోశ్, బీజేవైఎం అధ్యక్షుడు సుధాకర్, కిసాన్‌మోర్చా అధ్యక్షుడు వెంకటేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాలు తనిఖీ

- రెండు రోజుల్లో 38 వాహనాలు సీజ్
- రూ.1,71,905 జరిమానా

ఆసిఫాబాద్: జిల్లాలో రెండు రోజులుగా రవాణా శాఖ అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై తిరిగే వాహనాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లా కేంద్రం, కాగజ్‌నగర్, కెరమెరి, జైనూర్, రెబ్బెన, వాంకిడితోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో జిల్లా రవాణా శాఖ అధికారి గంధం లక్ష్మి, ఎంవీఐలు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేకుండా, చలాన్లు చెల్లించకుండా 38 వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. రూ.1,71,905 జరిమానా విధించారు. జిల్లా రవాణా శాఖ అధికారి మాట్లాడుతూ వాహనదారులు సకాలంలో చలాన్లు చెల్లించాలని, స్పెషల్ డ్రైవ్‌లో వాహనం పట్టుబడితే 200 శాతం జరిమానా విధిస్తామన్నారు. చలాన్లు చెల్లిస్తే కేవలం 50 శాతం పెనాల్టీతో సరిపోతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.




విదేశీ అతిథులు వచ్చాయి..!

మంచిర్యాల జిల్లా జన్నారం అడవులకు విదేశీ అతిథులు వచ్చాయి. యూరోప్ ఆస్ట్రేలియా దేశాల్లో నివసించే పక్షులు వలస వచ్చాయి. కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో కల్పకుంట, బైసన్‌కుంట ప్రాంతాల్లో అరుదైన బ్లాక్‌స్టార్క్, నార్తర్న్ పెంటెల్స్ పక్షులు కనిపించినట్లు డిప్యూటీ కన్జర్వేటర్, జన్నారం ఎఫ్‌డీవో మాధవరావు తెలిపారు. ఇవి అరుదైన పక్షులని, ఇక్కడికి వలస వచ్చి వాటి సంతతిని పెంచుకుని తిరిగి వెళ్తాయని పేర్కొన్నారు. బ్లాక్‌స్టార్క్ పక్షులు అంతరించిపోయే పక్షుల్లో ఒకటని, అలాంటి పక్షులు ఇక్కడ కనిపించడం సంతోషకరమని అటవీ అధికారులు తెలిపారు.

– జన్నారం

కృత్రిమ గర్భధారణతో మేలుజాతి దూడలు


శిబిరాన్ని ప్రారంభిస్తున్న రమేశ్‌కుమార్

భీమారం(చెన్నూర్): పశువులకు కృత్రిమ గర్భధారణ చేయడం వల్ల మేలుజాతి దూడలు అభివృద్ధి చెందుతాయని జిల్లా పశువైద్యాధికారి రమేశ్‌కుమార్ అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లా భీమారం మండలంలోని ధర్మారంలో ఏర్పాటు చేసిన ఉచిత పశు గర్భకోశ చికిత్స శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో దేశివాళీ దూడలకు జన్మనిస్తున్న పశువులు ఆరోగ్యంగా లేకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కృత్రిమ గర్భధారణ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా ఇతర ప్రాంతాలకు చెందిన పశువుల వీర్యాన్ని సేకరించి ఇక్కడి పశువులకు ఇవ్వడం ద్వారా నాణ్యమైన దూడలకు జన్మనిస్తాయన్నారు. వీటి వల్ల ఆరోగ్యకరమైన పశుజాతితో పాటు పాల ఉత్పత్తి కూడా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు శంకర్, మండల వైద్యాధికారి రాకేశ్‌శర్మ, సర్పంచ్ చెడంక లక్ష్మి, గోపాల మిత్రలు సంపత్, రమేశ్, వైద్యసిబ్బంది నర్సింహులు పాల్గొన్నారు.

పులులకు ఆహారంగా జింకలు


జింకలను వదులుతున్న అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: అటవీ ప్రాంతంలో ఆహారం దొరకకపోవడంతోనే గ్రామాల వైపు పులులు వస్తున్నాయని భావించిన అధికారులు వాటికి ఆహారంగా అడవిలో జింకలను వదులుతున్నారు. హైదరాబాద్‌లోని వన్యప్రాణుల సంరక్షణ కేంద్రం నుంచి ఇటీవల 25 జింకలను తీసుకువచ్చిన అధికారులు కాగజ్‌నగర్ మండలంలోని గోంది అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. తడోబా పులుల అభయారణ్యం నుంచి నిత్యం కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని అటవీ ప్రాంతాల్లోకి వస్తున్నాయి. కాగజ్‌నగర్, సిర్పూర్ (టి), బెజ్జూర్, పెంచికల్‌పేట అడువులు పులి ఆవాసానికి అనుకూలంగా ఉండటంతో స్థిర ఆవాసాలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. దీంతో పులుల ఆహారం కోసం జింకలను వదులుతున్నారు.

వేధింపులకు గురిచేస్తే ఆత్మహత్య చేసుకుంటా..


పురుగుల మందు డబ్బాతో శరత్‌చంద్ర

కౌటాల: తనను వేధింపులకు గురిచేస్తే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని మండలంలోని తాటినగర్‌కు చెందిన శరత్‌చంద్ర గురువారం సోషల్ మీడియాలో పోస్టుచేసిన వీడియో వైరల్‌గా మారింది. తనను కౌటాల తహసీల్దార్, పోలీసులు వేధింపులకు గురిచేస్తున్నారని అందులో పేర్కొన్నా డు. తహసీల్దార్ తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టారన్నాడు. దీంతో పోలీసులు తనకు రోజు ఫోన్ చేసి తన ఆధార్‌కార్డు తీసుకొని రావాలని వేధింపులకు గురి చేస్తున్నారన్నాడు. తనపై అన్యాయంగా కేసులు బనాయించి జైలుకు పంపించే ప్రయత్నం చేస్తున్నారన్నాడు. తనకు ఏం జరిగినా ఆత్మహత్య చేసుకుంటానన్నారు. ఎస్పీ, కలెక్టర్ స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా తన విధులకు ఆటంకం కలిగించడంతో పాటు తనపై అనుచిత వ్యాఖ్యలు చేసిన శరత్‌చంద్ర పై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ షరీఫ్ ఫిర్యాదు మేరకు ఈ నెల 8న అతనిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసు విషయంలో పోలీస్ స్టేషన్‌కు రావాలని ఫోన్ చేస్తే రావడం లేదన్నారు.

విద్యార్థులే కూలీలుగా..



కౌటాల: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను ప్రభుత్వం మన ఊరు మన బడి కార్యక్రమంలో మోడల్ పాఠశాలగా ఎంపిక చేసింది. పాఠశాలలో అందుకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం పాఠశాలకు వ్యాన్‌లో డ్యూయల్ బెంచీలు రావడంతో ఉపాధ్యాయులు వాటిని విద్యార్థుల చేత కిందికి దింపించి పాఠశాల వరకు మోయించారు. దీంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎంఈఓ సోమయ్యను వివరణ కోరగా విషయం తన దృష్టికి రాగానే వెంటనే కూలీలను పెట్టి బెంచీలను పాఠశాలలో పెట్టించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వాంకిడి: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం ఆసిఫాబాద్ ఆర్‌ఆర్ కాలనీకి చెందిన నగోషే శంకర్ గురువారం ద్విచక్ర వాహనంపై ఆసిఫాబాద్ నుంచి వాంకిడి వైపు వెళ్తుండగా వాంకిడి వైపు నుంచి ఆసిఫాబాద్‌కు కారులో వస్తున్న అతిక్ చిన్న బెండార సమీపంలో ఢీకొట్టాడు. దీంతో శంకర్‌కు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఆసిఫాబాద్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలకు తరలించారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందాల్సి ఉందన్నారు.

ఎస్పీఎం కార్మికుడికి గాయాలు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లు కార్మికుడికి గురువారం సాయంత్రం ప్రమాదవశాత్తు గాయాలయ్యాయి. పేపర్ మిల్లులో పనిచేస్తున్న రాములు అనే కాంట్రాక్ట్ కార్మికుడు ఓ క్వార్టర్‌లో మరమ్మతులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. దీంతో అతని కంటికి గాయమైంది. స్థానిక ఈఎస్‌ఐ ఆస్పత్రిలో చికిత్సలు అందించి హైదరాబాద్‌కు తరలించారు.

మోసగించిన వ్యక్తిపై ఫిర్యాదు

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో పనిచేస్తున్న హరికాంత్ మరుగుదొడ్ల పేరుతో మోసం చేశాడని బెల్లంపల్లి మున్సిపాలిటీ బూడిదగడ్డబస్తీకి చెందిన పలువురు గురువారం మున్సిపల్ రీజినల్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీలోని 20, 21 వార్డులలో నివాసం ఉంటున్న బూడిదగడ్డ బస్తీ వాసులకు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఒక్కొక్కరికి రూ.12 వేల చొప్పున నిధులు మంజూరు చేయిస్తానని 2020 డిసెంబర్‌లో రూ.5వేల చొప్పున డబ్బులు వసూలు చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికీ బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ కాలేదన్నారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యుడిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో మాదరి రవి, అబ్దుల్లా, లక్ష్మణ్, అమీన, శివకుమార్, స్మిత, గోపీకృష్ణ, తదితరులు ఉన్నారు.